విచిత్రంగా అనిపించింది!

మనుష్యులు స్వభావం మాత్రం మారదా... ఎప్పటికీ ఒకే తీరున ఉంటుందా...?! ఈ పుకారు గురించి పున్నమ్మ కూడా విన్నది కాబోలు 'అన్నా... నీకెంతో మంచిపేరు ఉంది. నా మూలంగా ఆ పేరుకి మచ్చ తీసుకురావటం నచ్చలేదు...! నేనిక ఇటువైపురాను... అంది కన్నీళ్ళు తుడుచుకుంటూ.

ఆ రోజు మాధవీ అక్కడే ఉంది.

నేనేమీ జవాబు చెప్పకముందే మాధవి చెప్పింది. 'అలాగే పున్నమ్మా... నువ్విక పుల్లలకోసం ఇక్కడకు రానవసరం లేదు...! మా ఇంట్లో... నాతో పాటే ఉందువుగానీ...! మీ అమ్మాయిని బడికి పంపిద్దాం... ఇంటి దగ్గర నేనూ చదువు చెబుతాను... అప్పుడు... ఈ ఊరివాళ్ళు ఏం మాట్లాడుకుంటారో, ఏం చేయగలరో చూద్దాం...!'

పున్నమ్మ ఆశ్చర్యంతో కళ్ళు ఇంత చేసుకుని మాధవిని చూసింది. ఆనందంతో ఉక్కిరి బిక్కిరి అయిపోయి కన్నీళ్ళు కార్చింది...!

'నా పిల్లని సదివిస్తావా... ఎంత దయ నీకు తల్లీ...!' అంటూ మాధవి కాళ్ళు పట్టుకోబోయింది. 'అదేం పని' అంటూ మాధవి కోప్పడితే ఆగింది.

'నాకు మిత్తరికం చెల్లి.. నీకు మిత్తరికం ఆడబడుచు అన్నమాట...!' అన్నాను సరదాగా చిన్నగా నవ్వి.

'అవును బాగా గుర్తు చేశారు. రేపు మనింటి చుట్టుపక్కల వాళ్ళని పిలిచి ఈ బంధుత్వాన్ని శుభకార్యంలా చేస్తే... బావుంటుంది...' అంది మాధవి సరదా పడుతూ.

పున్నమ్మ 'మిత్తరికం ఏవిటీ...?' అనడిగింది మాధవిని ఆశ్చర్యంగా. అవునుమరి... ఆ మాట ఎప్పుడూ వినివుండదు...!

'నేను సరదాగా అన్నమాటని... నువ్వు నిజంగానే పట్టించుకుంటున్నావా...?' మాధవిని అడిగాను. 'అవును... ఇది చాలా మంచి ఆలోచనగా నాకూ అనిపించింది! నాకు తోడుగా పున్నమ్మ ఉంటుంది... ఆమెకు ఆసరాగా మనం ఉంటాం...! ఊరందరి నోళ్ళూ కూడా మూతబడతాయి...!' అంది మాధవి.

పున్నమ్మ ఇంకా అయోమయంగానే మా మాటలు వింటోంటే... మిత్తరికం గురించి నేనే వివరించాను. ఆ ఆచారం ఇప్పటికీ ఉందో, లేదో మాకూ తెలియదు. కానీ ఆ సాంప్రదాయం నాకు బాగా నచ్చింది...!

అంతా వివరంగా చెప్పాక మాధవిని చూపిస్తూ పున్నమ్మకి చెప్పాను. 'ఈవిడ నాకు ముందుగా... మిత్తరికం మరదలు వరస... ఆ తర్వాత పెళ్ళితో ఇల్లాలు అయింది గానీ...!'

ముగ్గురం సరదాగా నవ్వుకున్నాం...!

ఆ తర్వాత మాధవి నిజంగానే శుభకార్యం జరిపించింది. నాకు మిత్తరికం చెల్లిగా అందరికీ చెప్పింది. పున్నమ్మకూ, ఆ చిన్న పిల్లకూ కొత్త బట్టలు పెట్టింది. రెండు మూడు రకాల పిండి వంటలు చేసి చుట్టు పక్కల వాళ్ళను పదిమందిని పిలిచి భోజనాలూ పెట్టింది. కొందరు అలాంటి అనాథకు ఆసరా ఇవ్వటం చాలామంచిపని అని ప్రశంసిస్తే... మరికొందరు

ముక్కూ మొహం తెలీని వాళ్ళని ఇంట్లో తెచ్చిపెట్టుకోవటం మంచిది కాదని మందలించారట! అందరికీ మాధవి చిరునవ్వే సమాధానం అయింది...!

***

ఆ తరువాత మాధవి చేసింది చాలా మంచి పనేనని నాకూ అనిపించింది! పున్నమ్మ కూతురు చక్కగా శ్రద్ధగా చదువుకుంటోంది...! తెలివైన పిల్ల అంటూ మాధవి మెచ్చుకుని... తన బాగోగులు శ్రద్ధగా చూస్తోంది...!

పున్నమ్మ అన్ని పనుల్లో మాధవికి చేదోడుగా ఉంటోంది...!

మాధవి ప్రవర్తన చాలా మందికి విచిత్రంగా అనిపించిందట! పున్నమ్మని దూరం పెట్టాల్సింది పోయి, ఇంట్లోకి తెచ్చిపెట్టుకోవటం ఏమిటీ... పాముకు పాలు పోస్తే మాత్రం కాటు వేయకుండా ఉంటుందా.... అంటూ గుసగుసలు పోయారని విని... ఆ మాటలు నొప్పించాయా అని మాధవిని ఆరా తీశాను.

మాధవి చిన్నగా నవ్వుతూ చూసింది.

'ఊరి ప్రజల మేలు కోసం అంటూ ఈ అడవిని పెంచటానికి ఒక్కరుగా ఇన్నేళ్ళనుండి శ్రమ పడుతున్నారే... అలాంటి మీ మీద కూడా నింద వేయటానికి వెనుకాడని ఈ జనం మాటలకు నేను బాధపడటం ఎందుకూ...? ఈ మార్గం మీకు నచ్చిందనీ, ఇందులోనే ఆనందం ఉందనీ మీరంటూ ఉంటారా... మరి... ఎవరూ లేని... ఓ ఆడదానికి కాస్తంత నీడ కల్పించినందుకు నేనూ ఆనందించాలి గానీ బాధపడటం ఎందుకూ...?' అని ఎదురు ప్రశ్నించింది!

నాకు చాలా సంతృప్తిగా అనిపించింది!

ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొని స్థిమితంగా ఉండగల మాధవి లాంటి స్త్రీలే పురుషుడికి బలం..! అబలలని కొంతమంది పొరబడతారుగానీ,నిజమైన శక్తిమంతులు స్త్రీలే..! నేను కుటుంబ బాధ్యతలన్నీ మాధవికే అప్పగించేసి...నా లక్ష్య సాధన కోసం ఇలా శ్రమించగలిగానంటే...నా కుటుంబం వలనే వీలయింది కదా...! నా తిండీ తిప్పలు.. అన్నీ వాళ్ళే చూసుకున్నారు. అందుకే... ఏ మనిషి ఉన్నతిలోనైనా...పతనంలోనైనా కుటుంబానికీ కొంత బాధ్యత ఉంటుంది!

చాలా సమస్యల్ని సామరస్యంగా పరిష్కరించుకోగలగటంలో కుటుంబ సభ్యుల సహకారం తప్పనిసరి అవుతుంది!

పున్నమ్మకు ఈ అడవికి వచ్చి అప్పుడప్పుడూ నాకు సాయపడాలని ఉన్నాగానీ లేనిపోని పుకార్లకు ఆస్కారమివ్వటం ఎందుకని రావటం మానేసిందట! పులికి ఎదురు నిలబడగలిగే ధైర్యం ఉన్న పున్నమ్మని పుకారు భయం మాత్రం తేలికగా లొంగదీసుకోగలిగింది! నాకు ఆశ్చర్యంగా అనిపించినా అదే మంచిదని అనుకున్నాను.

ఈ అడవిని పెంచటంలో నేను సమస్యల్ని, ఎన్నో సవాళ్ళను ఎదుర్కొన్నాను. విత్తనాలు, మొక్కలు సేకరించటం... నాటటం, నీళ్లు పోయటం... ఇదే నా వృత్తిగా ఉండేది!

మా ఊరివాళ్ళు కూడా కొందరు కొన్ని మొక్కలు తెచ్చి నాటారు! కొందరు పిల్లలు

కూడా ఏవో పండుగల పేరు చెప్పి... మొక్కల నాటటం... డ్రిప్ పద్ధతిలో కుండలకు చిల్లులు పెట్టి నీళ్ళు పోసే ప్రక్రియలో నాకు సాయం చేయటం కూడా జరుగుతూండేది!

***

ఒకసారి... ఒక ఫారెస్టు అధికారి వచ్చారు.

ఎవరో నేను అక్రమ చర్యలకు పాల్పడుతున్నానని ఫిర్యాదు చేయటం వలన విచారణకు వచ్చినట్లుగా నాకు తెలియజేశారు!

'నిన్నెందుకు అరెస్టు చేయకూడదూ' అని ప్రశ్నించేసరికి నేను భయపడకుండా నిదానంగా వివరంగా చెప్పాను.

'చెట్లను నరకటం చట్టవిరుద్ధంగానీ... మనిషికి మేలు చేసే చెట్లను పెంచి పోషించటం నేరమెలా అవుతుందంటారూ..?' అనడిగాను.

'ఏమో...ఇలా నీది కాని స్థలంలో పెంచినట్లే పెంచి, కలపకోసం నరుకుతున్నావేమో..!' అనేసరికి ఆశ్చర్యపోయాను.

అప్పుడే ఒక లేడి పిల్ల వచ్చి నా చుట్టూనే తిరుగుతూంటే, నేను కాసేపు ఒళ్ళో కూర్చోబెట్టుకుని, వదిలిపెడితే, అది పోకుండా నా దగ్గరే కూర్చుంది. 'చూశారా... దీని కాలుకి గాయమైతే నేనే మందులేసి కట్టుకట్టి నోటికి ఆహారం అందించా. అప్పటి నుండి ఇలా మాలిమి అయిపోయింది.

'ఎవరైనా పెంచి పెద్ద చేసిన తమ పిల్లల్ని తామే చంపుకునే సాహసం చేస్తారా....' అని అడిగేసరికి ఆయన ఆశ్చర్యపోయారు!

ఈ అడవిలోని చెట్లు నాకు పిల్లలతో సమానం కాదు.అంతకంటే ఎక్కువేనని ఆయనకూ అర్థమైంది!

ఆ తరువాత నాతో కాసేపు కబుర్లు చెప్పి, అభినందించారు కూడా!

ఆయనకూడా... 'ఒక్కరుగా ఇంత అడవిని పెంచటం ఎంత గొప్ప విషయం' అని ప్రశంసిస్తే... నా అభిప్రాయం నేను చెప్పాను.

'ఇది నా ఒక్కడి వల్లే సాధ్యమైందని నేననుకోను! నేను కొన్నింటిని నాటాను... నిజమే! అయితే, అవి కాయలు కాసాక ఆ విత్తనాలను వెదజల్లటంతో గాలి, పక్షులూ పాత్ర వహిస్తాయి. ఎలా వెదజల్లాలో కూడా వాటికి తెలుసు...! వాటిని మొలకెత్తించటంలోని మా ఊరి చెరువు నీళ్ళకూ ప్రాధాన్యత ఉంది! ఇప్పుడు చెప్పండి... నేనొక్కడినే సాధించానా...?' ఆ ప్రశ్నకి ఆయన నవ్వుతూ 'కాదనీ అనలేను... అవుననీ అంగీకరించలేను...!' అన్నారు. ఆయన కూడా భయం గురించి సందేహాన్ని బయటపెట్టారు.

'మనుష్యుల్లో ఉన్నట్లు... దగాకోరుతనం... నయవంచన... లాంటి దుర్మార్గ లక్షణాలేవీ జంతువులకు ఉండవు. భయపడాల్సింది అలాంటి లక్షణాలను అలవరుచుకుంటున్న మనుష్యులకు మాత్రమే! అందుకే... నేను జనం వచ్చినప్పుడే ఎక్కువ జాగ్రత్తగా ఉంటాను. అడవిని చూడాలనో, పిక్నిక్ లంటూ సరదాగా గడపాలనో వచ్చేవాళ్ళకు.. ప్లాస్టిక్ సంచుల్లాంటి హానికారక వస్తువుల్ని వదిలి వెళ్ళొద్దనీ, చెట్లు కొమ్మలను విరవటంలాంటి చర్యలకు పాల్పడవద్దనీ

హెచ్చరిస్తూ ఉండటమే కాదు, వాళ్ళని కనిపెట్టి చూస్తూ ఉంటాను! మనుష్యులతో మాత్రమే ఎక్కువగా జాగ్రత్తగా మెలగాలనే విషయం మీకూ అర్థమయ్యే ఉంటుందనుకుంటా...!' శ్రద్ధగా నా మాటల్ని విని ఆయనా అవునన్నట్లు తల ఊపారు.

అరెస్టు చేయాలంటూ వచ్చిన ఆయన అభినందిస్తూ వెళ్ళిపోయారు!

ఇది చాలా చిన్న సమస్య. సమాధానాలతో సమసిపోయింది! ఆయన సందేహాలు తీరిపోయాయి! కొన్నిసార్లు పెద్ద పెద్ద సమస్యల్నీ ఎదుర్కోవాల్సివచ్చింది!

ఈ అడవిలో మద్ది, రావి, టేకు లాంటి వృక్షాలతో పాటు ఎన్నెన్నో చిన్న చిన్న మొక్కలూ ఉన్నాయి. అలాగే రకరకాల జీవరాశులూ ఇక్కడ స్థావరం ఏర్పరుచుకున్నాయి!

ఇంతకు ముందు చెప్పినట్లుగా ఈ అడవిలో సంచరిస్తూంటే... కుందేళ్ళులాంటి చిన్న చిన్న జంతువులు గెంతుతూ, పరుగులు పెడుతూ ఎలా కనువిందు చేస్తాయో, అలాగే ఏనుగుల ఘీంకారాలు, రకరకాల జంతువుల అరుపులూ, పక్షుల కిలకిలారావాలు, కోతుల కిచకిచలూ అన్నీ కలగలిసి వైవిధ్యభరితమైన సంగీతంలా వీనులవిందు చేస్తుంటాయి! ఒకోసారి భయాన్నీ కలిగిస్తుంటాయి.

అవును... పులులూ, ఏనుగులూ లాంటి ఎన్నో రకాల జంతువులు ఈ అడవిలో ఆశ్రయాన్ని పొందుతున్నాయి!

ఒకసారి అయిదారు ఏనుగు పిల్లలు పొరుగూరి వాళ్ళ పొలాల్లోకి చేరి అల్లరి సృష్టించాయట! వాటిని వాళ్ళు తరిమితే, ఈ అడవిలోకే దూరాయి కాబట్టి... వాటి పనిబట్టటానికి ఈ అడవికే నిప్పు పెట్టాలని ప్రయత్నించారు!

అడవిలో కిరసనాయిలు చల్లి అంటించే సరికి, ఒక చెట్టు అగ్నికి ఆహుతైపోతుంటే, నేను ఆగలేకపోయాను! విలవిలలాడిపోయాను!

'మీరు దగ్ధం చేస్తున్నది... మీకు హాని కలిగించిన శత్రువులనుకుంటున్నారేమో, కానీ కాదు... మన ప్రాణదాతల్ని తగలబెట్టే దుస్సాహసం చేస్తున్నారు..' అని అరుస్తూ, ఆ మంటల్లోకి దూకటానికి సిద్ధమైపోయాను!

అవును... ఈ అడవిలో ఏ చెట్టుమీద చెయ్యివేసినా, గొడ్డలి వేటు పడినా, అది ముందు నాకే తగులుతుంది...! ఏ కుటుంబ పెద్ద అయినా, తన పిల్లల్ని ఎవరైనా గాయపరుస్తుంటే చూస్తూ వూరుకోగలడా...? నేనూ అంతేమరి... సహించలేను! ఊరి వాళ్ళెవరో నన్ను మంటల నుండి కాపాడారు. ఊరు ఊరంతా కదిలివచ్చారు! వాళ్ళదాడిని ప్రతిఘటించారు. అలా ఊరి వాళ్ళంతా నాకు అండగా నిలబడటం...నాకు చాలా ఆనందం కలి గించింది! అంటే..వాళ్ళంతా నా లక్ష్యాన్ని అర్థం చేసుకున్నారు..అంగీకరించి అండగా నిల బడ్డారు! అంతకన్నా నేను కోరుకునేదేముంది...! అలాగే, ఇంకోసారి ఇంకో విధమైన సమస్య వచ్చింది.

పొరుగూరి వాళ్ళెవరో... అడవిలో... రాత్రిపూట చొరబడి విలువైన చెట్లను నరికి, కలపను కాజేయాలనే పథకం వేసారని!

ఆ విషయం ఎలాగో బయటకు వచ్చి మాకూ తెలిసింది.

రాత్రిపూట అది నిజమో కాదో నిర్ణయించుకోవటానికి కొందరు చెట్లుచాటున మాటు

వేసి కూర్చున్నారు.

ఏదో జరగబోతోందని పెద్దవాళ్ళల్లో... ఒకటే ఆందోళన!

పిల్లలు, యువకుల్లో మాత్రం...ఏదో సాహసకృత్యాన్ని నిర్వర్తిస్తున్నామన్నట్లు ఉత్సాహం! అదొక సినిమా సంఘటనలా జరిగింది.

నాలోనూ ఏదో తెలియని కంగారూ, కలవరపాటూ...!

అటువైపు రెండు కాగడాల వెలుగు కనుపించగానే, మా ఊరి వాళ్ళు అప్రమత మైపోయారు. ఊళ్ళోకి కబురు చేరిపోయింది !

ఇంకేముంది... లాంతర్లతో సిద్ధంగా ఉన్న జనమంతా వచ్చి పడ్డారు! దాంతో విషయం తెలిసిపోయిందని గ్రహించిన వాళ్ళు పలాయనం చిత్తగించారు కాబోలు, కాగడాల జాడ కనిపించలేదు!

తేలిగ్గా ఊపిరి తీసుకుని ఊరిజనం అంతా విశ్రమించటానికి వెనక్కి మళ్ళుతా రనుకున్నా. కానీ వాళ్ళెవరూ ఇళ్ళకు వెళ్ళకుండా ఆ రాత్రికి అక్కడే కాపలాగా ఉండిపోవాలని నిర్ణయించుకోవటంతో, నాకు కొండంత బలం వచ్చినట్లనిపించింది!

కొందరు కాపలాగా అన్ని వైపులా గమనిస్తోంటే... మిగతా అందరూ కబుర్లు, కేకలతో సందడి సందడిగా గడిపేశారు. పిల్లల్ని ఇళ్ళకు వెళ్ళమన్నా ఎవరూ వినలేదు. వాళ్ళకీ ఆ చెట్ల మధ్య నిజంగా పండుగలాగే ఉంది! ఆటపాటలతో శివరాత్రి జాగరణలా హుషారుగా మైమరిచిపోయారు!

అలా... యుద్ధవాతావరణం కాస్తా జాతరలా మారిపోయింది!

ఆ తరువాత ఎవరూ ఎప్పుడూ ఈ అడవిమీద కలపకోసం దాడిచేయటంగానీ, జంతువులను వేటాడే సాహసం గానీ చేయలేదు!

ఇలా అందరి ఆమోదముద్ర పొందగలగటం నిజంగా నా అదృష్టం...!

ఇదిలా ఉంటే... అటు నా కుటుంబ వ్యవహారాలన్నీ మాధవి నిర్వర్తించింది! చివరకు పిల్లల పెళ్ళిళ్ళ వరకూ కూడా! నేను ఆత్మీయ అతిథిలా వెళ్ళి ఆనందంగా నాలుగు అక్షింతలు వేయటమే చేశాను.

ఇలా నాకు అడవి పెంపకంలో ఎదురైనట్లే కుటుంబం విషయంగానూ కొన్ని సమస్యల్ని మాధవీ ఎదుర్కొంది. నన్ను సంప్రదించి సలహాలు మాత్రమే తీసుకునేది గానీ ఇంకేరకంగానూ నాకు ఇబ్బంది కలిగించలేదు.

మరో ఆలోచనలేకుండా నా కార్యసాధనకు పరోక్షంగా చాలా సహకారం అందించింది కూడా! పున్నమ్మ కూడా తన పిల్ల బాధ్యత నిశ్చింతగా మాధవికి అప్పగించేసి, ఇంటి పనుల భారం మాత్రం వహించింది!

అంతేకాదు, ఊళ్ళో ఎవరికి ఎటువంటి అవసరం వచ్చినా పరుగెత్తి వెళ్ళి తన చేతనైన సాయం చేస్తూండటంతో అందరికీ అభిమాన పాత్రురాలైంది!

అవహేళనలు, అవమానాలూ ఎదురైన చోటే... అభిమానాన్నీ పొందగలిగింది! అదీ గొప్ప విజయమే... నా దృష్టిలో...!

***

అదిగో... ఆ కనిపించే చెట్టుపై చిన్న మంచెలాంటిది ఏర్పాటు చేశానా... రాత్రిపూట ఇక్కడే ఉండిపోవాలన్నా పడుకోవటానికి ఉపయోగపడుతుంది!

అప్పుడప్పుడు ఎన్నెన్నో విషయాలు ఎప్పటెప్పటివో గుర్తుకు వస్తుంటాయి! వాటిని నెమరేసుకోవటమూ ఆనందమే...!

మా పిల్లలు అప్పుడప్పుడు కుటుంబాలతో వచ్చి కాసేపుండి కాలక్షేపం చేసి వెళ్తుంటారు. నేను పెద్దలనుండి నేర్చుకున్నాననిపించేవీ, బాధ పెట్టిన అనుభవాలూ... ఇలా ఎన్నో విశేషాలను వాళ్ళతో పంచుకుంటాను. పెద్దవాళ్ళ అనుభవాలనుండి నేర్చుకోదగిన పాఠాలు ఎన్నో ఉంటాయని నా ఉద్దేశ్యం! అలాగే పిల్లల ఆలోచనలను వినటం పెద్దవాళ్ళకీ ఉత్సాహం, ఉల్లాసం కలగిస్తాయి...! వాళ్ళనుండీ కూడా పెద్దలు నేర్చుకోదగ్గ సంగతులూ ఉంటాయి!

చెప్పుకుంటూ పోతే, కుటుంబ సమస్యలూ, వాటినెలా పరిష్కరించుకోగలిగాం లాంటి కబుర్లు చాలానే ఉన్నాయిగానీ... అవన్నీ ఈ కథకి అనవసరం అని ఆపేస్తున్నాను...' అంటూ మౌనం వహించారు.

అంటే...'కథ సమాప్తం' అని చెప్పకనే చెప్పటమన్నమాట!

నేను... అప్పుడు... చిరునవ్వుతో చూస్తూ అన్నాను "సంకల్ప బలం ఉంటే సాధించలేనిదంటూ ఏమీ ఉండదనేదే మీ జీవిత కథ సందేశం... అని భావిస్తున్నాను! కరెక్టే కదండీ...?"

ఆయన తల అడ్డంగా ఊపి "సందేశం అనే పెద్ద మాట వద్దులే...! అది మన పెద్దలు ఎప్పుడో చెప్పిన సూక్తి...! నేను ఆచరించగలిగానంటే సరిపోతుందేమో...! అయితే నీ ద్వారా పిల్లలకు ఓ రెండు మాటలు చెప్పే సాహసం మాత్రం చేస్తాను. మనసులో... చెప్పాలనే తహతహలాంటిది ఉండి మనల్ని మౌనంగా ఉండనీయదనుకుంటా! అందుకేనేమో చాలామంది పెద్దలు... పిల్లలకు తమ అనుభవాలను ఏకరువు పెడుతూంటారు!

చిన్నతనంలో... నేనూ అనుకునేవాడిని... 'కొందరు పెద్దవాళ్ళు ఎందుకలా పిల్లలు కనుపించగానే అనుభవాలంటూ చెప్పటం మొదలు పెడతారూ...' అని!

ఇప్పుడు నేనూ అదే చేస్తున్నాననిపించి కొంచెం నవ్వు వస్తోంది! అయినా సరే చెబుతాను...' అనగానే, నేనూ చిన్నగా నవ్వి 'చెప్పండీ... మీరు బాగానే చెబుతారు... వినటానికి నాకేం విసుగులేదు...!' అన్నాను.

"మనకు ప్రాణదాతల్లాంటి చెట్లను నాటే పని చేయకపోయినా, వాటి విధ్వంసానికి మాత్రం మీరు కారకులు కాకండి! ప్రకృతిని ప్రేమించండి... సంరక్షించి... ఆనందాన్ని పొందే

అలవాటు చేసుకోండి...! పర్యావరణాన్ని కాపాడుకోవటమంటే... మనకి మనం మేలు చేసుకోవటమేననే అవగాహన అందరికీ కూడా కలిగించండి... చెట్టూ చీమల పట్ల కృతజ్ఞతను చూపించాలని మన పెద్దలు చెప్పటానికే పండుగల పేర పూజలు చేసే పద్ధతిని ప్రవేశ పెట్టారేమో... మనం వారి ఉద్దేశ్యాన్ని గ్రహించనట్లుగా... ఒక రోజున మాత్రం పూజలు చేసినందువల్ల ప్రయోజనం ఏమీ ఉండదు! మొక్కల్ని నరికే హక్కు మాత్రం మనకి లేదని తెలుసుకుంటే చాలు... అప్పుడు మీరే మొక్కల్ని పెంచే మంచి అలవాటును చేసుకోగలుగుతారు...!"

"నా వయసు, జ్ఞాపకశక్తిని బట్టి ఒక వరసక్రమంలో నా కథని చెప్పలేనేమోనని నీకు ముందుగానే చెప్పాను కదమ్మా! ఇప్పుడో రెండు సంఘటనలను చెప్పి ఒక ముగించేస్తాను. నా శక్తి సామర్థ్యాల గురించి చెప్పటానికి ఈ విషయాలను చెప్పబోవటం లేదుగానీ నరసింహంగారి వ్యక్తిత్వాన్ని తెలియజేయాలనే భావనతోనే చెప్పాలనుకుంటున్నాను.

ఒకసారి నేను నరసింహంమూర్తిగారి కోసం ఢిల్లీ వెళ్ళి పార్టీ పెద్దలతో మాట్లాడవలసిన విషయాలన్నిటినీ తయారుచేస్తున్నాను. అప్పుడు అక్కడికి వచ్చిన నరసింహంగారి పి.ఏ. గిరీస్ వారితో 'ఏమిటి అంకుల్... ఇతను పల్లెటూరివాడు... తెలుగులో ఏదో రాస్తే వాళ్ళకి ఏం అర్థమౌతుంది... ఇలాంటివి నేను చేయాలిగానీ, ఇతనెందుకూ కల్పించుకోవటం..?' అన్నాడు కొంచెం చిరాకుగా.

నరసింహంగారు గిరీష్ వైపు చిరునవ్వుతో చూస్తూ "నేనూ పల్లెటూరు నుంచి వచ్చినవాడినేగా... నాకూ ఏం తెలియదనేదే నీ అభిప్రాయాము అనుకోనా?" అని అడిగారు.

గిరీష్ తత్తరపడుతూ "అయ్యో...ఆ మాట నేనెందుకంటానూ... ఇతని గురించి ఆంటీ చెప్పింది... పాపం... చదువుకునే అవకాశం లేకుండా పోతే, ఏదో మీరు మీ దగ్గిర పెట్టుకుని మంచీ చెడ్డా చూస్తున్నారని! పాడి పశువుల గురించి బాగా తెలుసుండ వచ్చునుకోండి.. అంత మాత్రాన అన్ని విషయాలూ ఎలా తెలుస్తాయని నా అభిప్రాయం...!" అన్నాడు.

"నీ మాటలు నిజమే గిరీ... పెద్దవాళ్ళకి మన ఆలోచనలన్నీ బాగా అర్థమై ఆచరించటానికి అనుమతి ఇవ్వాలంటే... మనం చక్కని భాషలో వ్యక్తీకరించగలగాలి! అయితే నాకు తెలిసినవన్నీ నేను ప్రత్యేకించి బోధించకపోయినా, వాడు తెలుసుకోగలడని నా అభిప్రాయం. అలాంటి తెలివితేటలున్నాయి! ఇప్పుడు తను తయారు చేసినదేమిటో మనకు వినిపించమందాం అప్పుడు నువ్వే తెలుసుకోగలుగుతావు...నా శిష్యుడు గురించి..." అంటూ నన్ను చదివి వినిపించమన్నట్లుగా నా వైపు చూశారు.

కొంచెం దూరంలో ఉన్న నేను నా కుర్చీని వారికి దగ్గరగా జరుపుకుని చేతిలోని కాగితాలవైపు చూడకుండానే నేను ప్రిపేరు చేసినదానిని ఆంగ్లంలోనే గడగడ చెప్పేశాను! నివ్వెరపోయి విన్న గిరీష్ తో నరసింహంగారు చిరునవ్వుతో చూస్తూ మళ్ళీ అన్నారు "పల్లెటూరు వాడు, పశువుల కాపరి అని నువ్వు అనుకుంటున్న అతని భాష, విషయ పరిజ్ఞానం ఎలాంటివో తెలిసిందా...? గిరీ, ఒక మాట తెలుసుకో మనం పుట్టి పెరిగింది పట్నమా, పల్లెటూరా అన్నది ముఖ్యం కాదు... నేర్చుకోవాలనే తపనా, తెలివి తేటలూ, శ్రద్ధా ఉంటే చాలు ఏదైనా సాధించగలం!"

గిరీష్ చిన్నబోయిన మొహంతో మారు మాట్లాడకుండా అక్కడ నుండి వెళ్ళిపోయాడు. ఇష్టమైన వ్యక్తులు అయినా కాకపోయినా, ఎవరితోనైనా సరే కటువుగా కాకుండా నరసింహం గారు మృదువుగానే హితవు చెబుతారు. అది వారి ప్రత్యేకత. నేనూ వారినుండి నేర్చుకున్న మంచి లక్షణం అది!

ఇంకొకసారీ అంతే.

నరసింహంగారి అబ్బాయి, నేనూ కూర్చుని వారితో ఏదో మాట్లాడుతున్నాం. వారి అబ్బాయి స్నేహితుడి గురించి ఏదో వ్యాపారం కోసం సిఫారసు చేయాల్సిన విషయం మీద చర్చ జరుగుతోంది.

నరసింహంగారు వారి అబ్బాయితో " నేను గమనించింది ఏమిటంటే... నీ ఫ్రెండుకి మన అధికారం అడ్డం పెట్టుకుని వ్యాపారం పేరుతో ఇబ్బడి ముబ్బడిగా సంపాదించెయ్యాలనే కోరికే గానీ, నిజాయితీగా కష్టపడి పని చేయాలనుకోవటం లేదు! అలాంటి వారితో నువ్వు వ్యాపారంలో భాగస్వామి కావటం నాకు ఇష్టం లేదు. అవినీతి మరకలతో ఎంతటి గొప్ప జీవితం అయనా మనకు ఆనందాన్నివ్వదు. అయినా మీ అమ్మో, నేనో చెప్పామని వ్యాపారమో, రాజకీయాలో నీకు తప్పనిసరని అనుకోకు. నీకు ఏది ఇష్టమైతే, అందులోనే కొనసాగటానికి ప్రయత్నించు. ఇష్టమైన రంగంలో అడుగు పెట్టగలిగితే కష్టపడటమనేది శ్రమగా ఉండదు! వారసత్వంగా ఏ పదవి, అధికారం లభించినా... ఆ తర్వాత దానిని నిలుపుకోవటానికైనా కష్టపడాల్సిందే! ఆలోచించు...' అని నచ్చచెప్పబోతున్నప్పుడు మేడమ్ వచ్చారు.

'ఇలాంటి హితోక్తులన్నీ మాకే చెబుతారు... స్వంత కొడుకయినా వాడి ఎదుగుదల పట్ల మీకు శ్రద్ధ ఉండదు! ఎవరినో మాత్రం దగ్గర పెట్టుకుని అందరికీ కొడుకు లాంటి వాడు, వారసుడు అని పరిచయం చేస్తారు...!' అంటూ ఆవిడ రుసరుసలాడారు.

నరసింహంగారు మాత్రం కోపం లేకుండా సరదాగా నవ్వేసారు. 'శ్రద్ధ లేకపోతే

ఇన్ని విషయాలు నచ్చచెబుతూ మాట్లాడతానా... నువ్వన్న ఆ వేరెవరికో నేనెపుడూ ఏ మాటలైనా బోధించటం విన్నావా...? అలాంటి అవసరమే రానప్పుడు సూక్తులు వల్లె వేయటం ఎందుకూ...?' అన్నారు.

అలా నా గురించి పరోక్షంగా నరసింహంగారూ చెప్పటం వారికి నా పట్ల ఉన్న అభిమానానికి నిదర్శనం! నమ్మిన సిద్ధాంతాలతో రాజీ పడాల్సి వచ్చినప్పుడు మరో ఆలోచన లేకుండా పదవినే వదులుకోగలిగారు! విలువలా, వ్యక్తిగత ప్రయోజనమా అనే సందిగ్ధం వస్తే, ఎటువంటి సందేహం లేకుండా విలువలవైపే మొగ్గు చూపుతారు! అంతటి గొప్ప వ్యక్తి అనుచరుడిగా, నేనూ అటువంటి విలువలనే ఒంటబట్టించుకున్నాను. పాటించాను! అందుకే నిజాయితీగా బ్రతకటంలోని సంతృప్తినీ, సంతోషాన్ని అనుభవించగలిగాను.

నిజంగా సేవచేయాలనే అభిలాష ఉంటే, రాజకీయాలే మార్గం కాదు! ఎన్నెన్నో మార్గాలలో అదీ ఒకటి. అంతే. విరక్తి కలిగినప్పుడు తేలికగా వదిలి మనసుకు నచ్చిన మార్గం కనిపించగానే అడుగేసేసాను!

ఇలా నా జీవితంలో తల్లిదండ్రులు, నరసింహంగారు, నిష్కల్మషమైన మనసు కలిగిన ఓ చిన్న పిల్లవాడు... గురువుల్లా స్ఫూర్తి ప్రదాతలుగా నన్ను నడిపించారు! అడవి మనిషిగా మీ అందరి ఆదరాభిమానాలనూ అందుకోగలిగిన అదృష్టవంతుడినీ అయ్యాను! అంటూ చెప్పటం ముగించారు. ఒక క్షణం ఆగి...

"ఇంతేనమ్మా... ఎక్కువగా చెప్పానా...?" అంటూ నావైపు చిరునవ్వుతో చూశారు.

"లేదండీ..చాలా మంచి మాటల్ని చెప్పారు...ఈ రోజు...ఇలా మిమ్మల్ని కలుసుకోగలగటం..మీ అనుభవాలను మీ ద్వారానే వినగలగటంతో.... నాకు చాలా చాలా ఆనందంగా ఉంది! ఈ కథను మార్చటం నా వల్ల అవుతుందనిపించటం లేదు. ఇలాగే రాస్తే ప్రయత్నం సరిపోతుందనుకుంటాను...!" అని చెప్పి... మా వాళ్ళను కలవటానికని అడుగులు వేసి... ఒక క్షణం ఆగి, అన్నాను. " మా వాళ్ళు... ప్లాస్టిక్ సంచుల్లాంటి చెత్త వదిలేసి వెళ్ళకుండా సరిగా శుభ్రం చేశారో లేదో కూడా గమనిస్తాను...!"

చిరునవ్వుతో చూస్తున్న ఆయనకు... అడవి తల్లికే అమ్మలా సేవచేస్తూ 'అడవి మనిషి' బిరుదును సంపాదించిన... ఆ గొప్ప వ్యక్తికి... మళ్ళీ ఓసారి మనసారా నమస్కరించి... వడివడిగా అడుగులు వేసాను!.....

**సమాప్తం**